
ఆంధ్రజ్యోతి
రంజాన్ వేళలు బుధవారం(ఇఫ్తార్-6:33), గురువారం (సహర్-5:05)
ANDHRAJYOTHY
5

మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
బుధవారం 13 మార్చి 2024

కేజీన్నర వెండి అపహరణ

ధరూరు, మార్చి 12 : జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలం భూరెడ్డిపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో కేజీన్నర వెండి అపహరణకు గురైంది. ఎస్సై విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయాన్ని మంగళవారం శుభ్రం చేసేందుకు వెళ్లిన అర్చకులు ఆలయంలో స్వామివారి వెండి కిరీటంతో పాటు, శ్రీవారి పాదుకలు లేకపోవడంతో గమనించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆలయంలో తనిఖీ చేశారు. గత సోమవారం గుర్తు తెలియని వ్యక్తి సంచరించాడని గ్రామస్థులు తెలుపడంతో ఆరా తీశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.



మ్యాజిక్ గేమ్ షురూ

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం పార్టీల యత్నాలు
- ఉన్న వారిని కాపాడుకునే పనిలో బీఆర్ఎస్
- చేరికలను ప్రోత్సహిస్తోన్న కాంగ్రెస్
- పోటీలో లేని బీజేపీ మద్దతు కోసం ఇరు పార్టీల మంతనాలు
- ఎమ్మెల్సీ ఎన్నికల మొత్తం ఓటర్లు 1,439

మహబూబ్‌నగర్, మార్చి 12: ఉమ్మడి పాలమూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నామినేషన్, స్క్రూట్నీ ప్రక్రియ ముగియడంతో విజయం సాధించడమే లక్ష్యంగా రాజకీయ పార్టీలు పావులు కదుపుతున్నాయి. ఈ ఎన్నికల్లో గెలవాలంటే మ్యాజిక్ ఫిగర్ కీలకం కావడంతో ఆ సంఖ్యను చేరుకోవడమే లక్ష్యంగా మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో 888 మంది ఎంపీటీసీ సభ్యులు, 83 మంది జడ్పీటీసీ సభ్యులు, 449 మంది కౌన్సిలర్‌లు, 14 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలు, ఇద్దరు ఎంపీలతో కలిపి మొత్తం 1,439 మంది ఓటర్లు ఓటు హక్కు కలిగి ఉన్నారు. అన్ని ఓట్లు పోలైతే.. ఎవరికి 720 ఓట్లు పడితే వారు విజయం సాధిస్తారు. ఈ మ్యాజిక్ ఫిగర్ కోసం పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు వ్యూహాలు రచిస్తున్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మొదలైన పోరు

కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డిల మధ్యనే ప్రధానంగా పోటీ కొనసాగనుంది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి సిట్టింగ్ స్థానం కాపాడుకోవడంతో పాటు బీఆర్ఎస్ ఇంకా బలంగానే ఉందని చెప్పుకోవడానికి ఆ పార్టీ గట్టి ప్రయత్నాలు చేస్తోంది. సంఖ్యా బలం లేకున్నా బీఆర్ఎస్‌ను ఓడించడంతో అన్ని వర్గాలు కాంగ్రెస్ వైపే చూస్తున్నాయని చెప్పొచ్చని, ఇది పార్లమెంట్ ఎన్నికల ముందు మైలేజీని పెంచుతుందని కాంగ్రెస్ నాయకులు గెలుపు కోసం పట్టుదలతో పని చేస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన వారు, ఇప్పటికీ ఆ పార్టీలో ఉన్న వారి సంఖ్య 900 వరకు ఉండగా, కాంగ్రెస్ బలం 400 వరకు ఉంది.


ఎవరికి వారే..

బీఆర్ఎస్ తమ సంఖ్యా బలాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తోంది. పార్టీ బలపరిచిన అభ్యర్థికే వాళ్లు ఓటు వేసేలా మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నమైంది. కాంగ్రెస్ తమకు టచ్‌లో ఉన్నవాళ్లు, తమ పార్టీలో చేరేందుకు ఆసక్తిగా ఉన్నవారితో పాటు కొంతమందిపై ఒత్తిడి తెచ్చి మ్యాజిక్ ఫిగర్‌ను దాటేందుకు పవర్ గేమ్‌ను ప్రారంభించింది. నామినేషన్ వేసిన రోజే మహబూబ్‌నగర్, షాద్‌నగర్ నియోజకవర్గాల కౌన్సిలర్‌లు, ఎంపీటీసీ సభ్యులు పది మంది వరకు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేర్చుకుని ఎన్నికల వేడిని రగిల్చింది. ఎన్నికల నాటికి ఇదే దూకుడును కొనసాగిస్తుందన్న ప్రచారం సాగుతోంది. దాంతో బీఆర్ఎస్ తమ ఓటర్లను కాపాడుకునేందుకు చెమటోడ్చాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇక పోటీలో లేని బీజేపీ బలం 90 మంది వరకు ఉండగా, ఈ ఎన్నికల్లో వారి మద్దతు కూడా ఇరు పార్టీలకు కీలకంగా మారింది. బీజేపీ అధిష్ఠానంతో ఇరు పార్టీల పెద్దలు మంతనాలు సాగిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్ కొద్ది రోజులుగా పార్టీలోకి కొత్తవాళ్ళు వస్తే చేర్చుకునే ప్రసక్తేలేదని చెప్పినా.. ఎమ్మెల్సీ ఎన్నికలతో స్వరం మార్చింది. పార్టీలోకి ఎవరు వచ్చినా ఆహ్వానిస్తామని, అందరినీ కడుపులో పెట్టుకుని చూసుకుంటామని చెబుతుండటంతో కొద్ది రోజులుగా అధికార పార్టీలో చేరాలని ఆసక్తి చూపుతున్న వారికి లైన్ క్లియర్ అయ్యింది. దాంతో అన్ని నియోజకవర్గాల్లో చేరికల పర్వం మొదలైంది.

మూడు నామినేషన్ల తిరస్కరణ

- ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 13 మంది

మహబూబ్‌నగర్(కలెక్టరేట్): మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసన మండలి ఉప ఎన్నికలో మూడు నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. నామినేషన్ల పరిశీలన మంగళవారం మహబూబ్‌నగర్ కలెక్టర్ చాంబర్‌లో చేపట్టారు. మొత్తం 16 మంది 28 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. జిల్లా రిటర్నింగ్ అధికారి జి.రవినాయక్, ఎన్నికల కమిషన్ నియమించిన పరిశీలకురాలు ఏ. వాణి ప్రసాద్ అభ్యర్థుల సమక్షంలో స్క్రూటనీ నిర్వహించారు. స్వతంత్ర అభ్యర్థులు శ్రీకాంత్ పిళ్లై, ఆర్.జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచి నామినేషన్ వేసిన లక్ష్మీరెడ్డి నామినేషన్లను తిరస్కరించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి మన్నె జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచి నవీన్ కుమార్ రెడ్డి, 11 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీలో నిలిచారు. నామినేషన్ల ఉప సంహరణకు ఈ నెల 14 వరకు గడువు ఉంది. తర్వాత తుది జాబితా ప్రకటించనున్నారు.



వేతన జీవుల వెతలు



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రి

- మూడు నెలలుగా అందని జీతాలు
- జనరల్ ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఇక్కట్లు
- ఏజెన్సీ నిర్వాహకుల నిర్లక్ష్యం



మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) మార్చి 12: మహబూబ్‌నగర్‌లోని జనరల్ ఆస్పత్రిలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మూడు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ సంస్థలో పని చేస్తున్నామన్న పేరే కాని జీతాలు నాలుగైదు నెలలకు ఒకసారి వస్తాయని, అవి కూడా ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతం పైనే ఆధారపడి బతుకుతున్న వారు డబ్బులు రాక అవస్థలు పడుతున్నారు. ఏజెన్సీ నిర్వాహకులు బడ్జెట్ లేదని కుంటిసాకులు చెబుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

110 మంది విధి నిర్వహణ

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మల్లారెడ్డి అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ పని చేస్తోంది. దాని పరిధిలో దాదాపు 214 మందికిపైగా ఉద్యోగులు పని చేస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్లు 38 మంది, ఫార్మసిస్టులు 28 మంది, నర్సింగ్ సిబ్బంది 124 మంది పని చేస్తున్నారు. స్టెరిలైజేషన్ విభాగంలో ఆరుగురు, ఈసీజీ టెక్నీషియన్లు ఐదు మంది, డెంటల్ టెక్నీషియన్ ఒకరు, రేడియాలజీ విభాగంలో 12 మంది ఉన్నారు. వీరంతా ఆయా విభాగాలలో 2017 నుంచి పని చేస్తున్నారు.

పూట గడవటం కోసం అప్పులు

ఉద్యోగులకు మూడు నెలలుగా వేతనాలు రావడం లేదు. 2023 నవంబరు నుంచి ఫిబ్రవరి 2024 వరకు జీతాలు ఇవ్వలేదు. దాంతో వారు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అప్పులు చేసి కాలం వెళ్లదీస్తున్నారు. ఇదేంటని అడిగే ధైర్యం కూడా చేయలేకపోతున్నారు. అడిగితే ఎక్కడ ఉద్యోగంలోంచి తొలగిస్తారోనని లోలోపల కుమిలిపోతున్నారు. రాత్రీ, పగలు డ్యూటీలు చేసుకుంటూ వైద్యసేవలకు ఆటంకం కలుగకుండా చూస్తున్నారు.

రెండు నెలలు అడ్వాన్స్ ఇవ్వాల్సిందే

ప్రభుత్వం నుంచి బడ్జెట్ కొంత ఆలస్యం జరిగినప్పటికీ ఏజెన్సీ నిర్వాహకులు ఉద్యోగులకు రెండు నెలల అడ్వాన్స్ ఇవ్వాల్సిందే. ఇదే విషయాన్ని వారితో చెప్పాం. పిలిపించి మాట్లాడాము. ప్రభుత్వానికి కూడా జీతాల బడ్జెట్‌కు సంబంధించి లేఖ రాశాం. త్వరలో వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- డాక్టర్ జీవన్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

నిబంధనలు పట్టించుకోని ఏజెన్సీ

మల్లారెడ్డి అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకులు నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తున్నారు. ప్రభుత్వం నుంచి బడ్జెట్ వస్తేనే జీతాలిస్తామని, ఇవ్వకుంటే మేమేం చేయాలని దబాయిస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వం నుంచి బడ్జెట్ రావడం ఆలస్యం అయితే రెండు నెలల వరకు వేతనాలు ఇవ్వాలని వారికి ఇచ్చిన అగ్రిమెంట్‌లోనే ఉంటుంది. అవేవీ పట్టించుకోకుండా బడ్జెట్ వస్తేనే ఇస్తామనడం సరికాదని ఉద్యోగులు అంటున్నారు. జనరల్ ఆస్పత్రి అధికారులు సైతం ఏజెన్సీ నిర్వాహకులను నిలదీయకపోవడం విశేషం.



ల్యాబ్‌లో విధులు నిర్వహిస్తున్న టెక్నీషియన్లు

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

బల్మూరు, మార్చి 12 : చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం బిల్లకల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుండాల వెంకటయ్య(55) చేపల వేటకు వెళ్లి వస్తానని సోమవారం తన చెల్లెలు లక్ష్మమ్మకు చెప్పి గ్రామంలోని ఎర్రకుంట చెరువు వద్దకు వెళ్లాడు. వెంకటయ్య భార్య మూడేళ్ల క్రితం మృతి చెందడంతో ఇతను గ్రామంలోనే ఉంటున్న చెల్లెలి వద్ద ఉంటున్నాడు. సోమవారం తిరిగి ఇంటికి రాలేదు. మంగళవారం చెరువులో వెంకటయ్య మృతదేహం తేలడంతో గ్రామస్థులు లక్ష్మమ్మకు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరిశీలించారు. లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యూనిఫామ్స్ నిధులు వచ్చాయ్..

- ఉమ్మడి జిల్లాకు రూ.3.01 కోట్లు కేటాయింపు
- వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం రోజే పంపిణీకి చర్యలు
- కుట్టు బాధ్యత మహిళా సంఘాలకు ఇచ్చేందుకు నిర్ణయం



పాలమూరులో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న డీఈవో (ఫైల్)

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 12: వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా రెండు జతల యూనిఫామ్స్ అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఆ మేరకు ఉమ్మడి జిల్లాకు రూ.3.01 కోట్ల నిధులు వచ్చాయి. ఈ ఏడాది నుంచి యూనిఫామ్స్ కుట్టే బాధ్యత మహిళా సంఘాలకు అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించి విద్యా శాఖ ఉత్తర్వులు కూడా జారీ చేసింది. యూనిఫామ్స్ కుట్టేందుకు ఆసక్తి ఉన్న సంఘాలను ఈనెల 15 లోపు గుర్తించాలని విద్యా శాఖ ఆదేశాలు జారీ సింది. ఈ నెల చివరి నాటికి విద్యార్థుల కొలతలు తీసుకుని, జూన్ ఒకటో తేదీ నాటికి యూనిఫామ్స్ కుట్టాలని చెప్పింది.

ముందస్తు ప్రణాళిక

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, గురుకులాలు 3,370 ఉన్నాయి. వీటిలో మూడు లక్షలకుపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. అత్యధికంగా మహబూబ్‌నగర్ జిల్లాలో 71,689 మంది విద్యార్థులు ఉండగా.. అతి తక్కువగా వనపర్తి జిల్లాలో 42,841 మంది విద్యార్థులు ఉన్నారు. ఒక్కో విద్యార్థికి రెండు జతల చొప్పున యూనిఫామ్స్ అందిస్తారు. మొత్తం ఆరు లక్షల యూనిఫామ్స్ అవసరం ఉన్నాయి. యూనిఫామ్స్ వస్త్రాన్ని టెస్కో ద్వారా ఉమ్మడి జిల్లాలోని అన్ని మండల వనరుల కేంద్రాలకు సరఫరా చేయనున్నారు. అక్కడి నుంచి పాఠశాలలకు వస్త్రాన్ని అందజేస్తారు. గతంలో కుట్టు పనిని నిబంధనలకు విరుద్ధంగా ఎవరికి పడితే వారికి అప్పగించే వారు. దాంతో విద్యార్థులకు యూనిఫామ్స్ సకాలంలో అందేవి కావు. 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాల ప్రారంభం రోజే యూనిఫామ్స్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మహిళా సంఘాలకు కుట్టు పని అప్పగించేందుకు ముందస్తు ప్రణాళిక చేపట్టింది. దాంతో ఆసక్తి ఉన్న మహిళ సంఘాల పేర్లు నమోదు చేయించడంపై మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు దృష్టి పెట్టారు.

జిల్లా వారీగా విద్యార్థులు, యూనిఫామ్ కోసం కేటాయించిన నిధుల వివరాలు

జిల్లా	విద్యార్థుల సంఖ్య	నిధుల (రూ.లక్షల్లో..)
మహబూబ్‌నగర్	71689	71,68
నాగర్‌కర్నూల్	61,656	61.65
జోగుళాంబ గద్వాల	65,635	65.63
నారాయణపేట	59,870	59.87
వనపర్తి	42,841	42.84

ఒక్క విద్యార్థికి రూ.100

యూనిఫామ్ ఒకటో తరగతి నుంచి మూడో తరగతి చదివే విద్యార్థులకు ఒక డిజైన్ ఉంటుంది. నాల్గు, ఐదో తరగతి విద్యార్థులకు ఒక డిజైన్, ఆరు నుంచి పదో తరగతి వరకు ఒక డిజైన్ ఉంటుంది. ఒక విద్యార్థికి రెండు జతలకు కుట్టేందుకు ప్రభుత్వం రూ.100 చెల్లించనుంది.

నేడు మక్తల్‌కు ఉప ముఖ్యమంత్రి రాక

- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కూడా..



సంగంబండ సమీపంలో హెలీప్యాడ్, సభా స్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఎస్పీ యోగేష్‌గౌతమ్

మక్తల్, మార్చి 12: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం మక్తల్ పట్టణానికి రానున్నట్లు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. సంగంబండ రిజర్వాయర్ కింద లో లెవల్ కెనాల్ ద్వారా నీటిని అందించేందుకు అడ్డుగా ఉన్న బండ తొలగింపు పనులను ప్రారంభించడానికి వస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మక్తల్ పట్టణ సమీపంలోని సంగంబండ వద్ద ఎస్పీ యోగేష్ గౌతమ్, టీకేఆర్ ఫౌండేషన్ అధినేత బాలకృష్ణారెడ్డితో కలిసి ఎమ్మెల్యే హెలీప్యాడ్, సభా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి మక్తల్ మండలంలోని సంగంబండ లోలెవల్ కెనాల్‌లో ఉన్న బండరాయిని బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు పరిశీలిస్తారని చెప్పారు. అనంతరం బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. సభకు సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచందర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మంత్రుల రాక సందర్భంగా గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ చెప్పారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

- రేవల్లి మండలం శానాయిపల్లి గ్రామంలో ఘటన



లక్ష్మమ్మ(ఫైల్)

రేవల్లి, మార్చి 12 : అనుమానాస్పదంగా మహిళ మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా రేవల్లి మండలం శానాయిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ తిరుపతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాతర్ల లక్ష్మమ్మ(50)కు మతిస్థిమితం సరిగా లేదు. ఆదివారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో శానాయిపల్లి గట్టుపై కథ వినడానికి వెళ్తున్నానని చెప్పి ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం శానాయిపల్లి - రేవల్లి మధ్యలో గల కాలువలో మహిళ మృతదేహం ఉందని తెలుసుకున్న లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు వెళ్లి చూశారు. మృతదేహం ఆమెదేనని నిర్ధారించారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా.. సీఐ నాగభూషణం వెళ్లి పరిశీలించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని వనపర్తి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లక్ష్మమ్మను భర్త పెళ్లి చేసుకున్న రెండు సంవత్సరాలకే విడిచి పెట్టాడు. ఆమె మృతిపై గ్రామస్థులు, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. లక్ష్మమ్మ అల్లుడు సాతర్ల కృష్ణయ్య మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నారాయణపేట ప్రత్యేకతను చాటాలి

- చేనేత, జౌళి శాఖ రాష్ట్ర సంచాలకురాలు అలుగు వర్షిణి



మాట్లాడుతున్న చేనేత, జౌళి శాఖ రాష్ట్ర సంచాలకులు అలుగు వర్షిని

నారాయణపేట టౌన్, మార్చి 12: నారాయణపేట చేనేత ఖ్యాతిని మరింత పెంచేందుకు కృషి చేద్దామని చేనేత, జౌళి శాఖ రాష్ట్ర సంచాలకురాలు అలుగు వర్షిణి అన్నారు. మంగళవారం ఆమె జిల్లా పర్యటనకు వచ్చారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన చేనేత సహకార సంఘాల సభ్యుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేనేత కార్మికులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందాలని చెప్పారు. అంతకు ముందు కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి సమీపంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం పక్కనే మూడంతస్తులతో నిర్మిస్తున్న సమీకృత చేనేత భవనంలో పేట చేనేత చీరల ప్రత్యేకతను తెలిపేలా మ్యూజియం ఏర్పాటు చేస్తామన్నారు. వర్షిని మాట్లాడుతూ ఆ మ్యూజియంలో చేనేత చీరలను విక్రయించేందుకు ఒక దుకాణాన్ని కూడా ప్రారంభించాలని చెప్పారు. సమావేశంలో చేనేత, జౌళి శాఖ ఏడీ బాబు, అధికారులు పాల్గొన్నారు.

పురుగు మందు డబ్బాతో.. రైతుల ఆందోళన

- పనులను ఆపడానికి వీల్లేదన్న భారత్‌మాల ఉద్యోగి
- బావులు, బోర్లకు పరిహారం ఇవ్వలేదన్న బాధితులు

అయిజ, మార్చి 12: భారత్‌మాల రహదారిలో భూములు కోల్పోయిన అయిజ మండలం దేవబండ గ్రామానికి చెందిన రైతులు మంగళవారం పురుగు మందు డబ్బాతో ఆందోళనకు దిగారు. రహదారిపైకి చేరుకుని పనులను అడ్డుకున్నారు. భారత్‌మాల ఉద్యోగి అక్కడకు చేరుకుని రైతులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ భూములు కోల్పోయిన తమకు ఎకరాకు రూ.4.60 లక్షలు మాత్రమే అందచేశారని, భూముల్లో ఉన్న మోటార్లు, బావులు, పైపులకు పరిహారం ఇవ్వలేదని తెలిపారు. అందుకు సదరు ఉద్యోగి మీకు పరిహారం ఇచ్చినట్లు, మేము పనులు చేసుకోవాలని అధికారులు లెటర్లు ఇచ్చారని, పనులను ఆపడానికి మీకు హక్కు లేదని చెప్పారు. మీకు ఇంకా పరిహారం ఇవ్వడానికి ఏం ఆధారాలు ఉన్నాయని ప్రశ్నించారు. తమకు మోటార్లు, బావులు, పైపులకు పరిహారం ఇవ్వలేదని తెలిపారు. తాము అధికారులనే నమ్ముకున్నామని, వారే కాదంటే తమకు చావే గతి అని అన్నారు. రహదారికి అడ్డంగా పడుకుంటామని, తమపై వాహనాలు ఎక్కించి చంపండని వాపోయారు. దాంతో ఉద్యోగి పనులను నిలిపేసి, వెనుదిరిగి పోయారు.

ఆందోళనతో నిలిచిన వాహనాలు





పురుగు మందు డబ్బాతో ఆందోళనకు దిగిన రైతులు

నల్లగొండ జిల్లాలో
గొర్రెలకాపరి ఆత్మహత్య

వేములపల్లి, మార్చి 12 : మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గొర్రెలకాపరి నల్లగొండ జిల్లాలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. వేములపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం అజలాపురం గ్రామానికి చెందిన కాకుంట్ల మహేష్(22) గొర్రెలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన గ్రామానికి చెందిన బాబాయి కాకుంట్ల శ్రీశైలంతో పాటు మరికొందరు కాపరులతో కలిసి గొర్రెలు కాస్తూ ఈనెల ఏడో తేదీన వేములపల్లికి చేరుకున్నారు. అప్పటినుంచి వేములపల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో గొర్రెలను మేపుతున్నారు. సోమవారం రాత్రి తోటి కాపరి కొర్ర భాస్కర్‌తో కలిసి భోజనం తిని నిద్రించాడు. మంగళవారం ఉదయం భాస్కర్ నిద్ర లేచేసరికి మహేష్ సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. దీంతో భాస్కర్ మహేష్ బాబాయి శ్రీశైలంకు సమాచారం అందించాడు. ఘటన విషయం తెలుసుకున్న పోలీసులు మహేష్ మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మహేష్ బాబాయి శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మహేష్ కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. కాగా, మహేష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని ఆయన పేర్కొన్నారు.

చెరువులో పడి మహిళ మృతి

హన్వాడ, మార్చి 12 : తాగిన మైకంలో మతిస్థిమితం లేని కూతురితో చెరువు వద్దకు వెళ్లిన తల్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన సంఘటన మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామన్నపల్లి గ్రామానికి చెందిన మొగలి భాగ్యలక్ష్మి(40), తన కూతురు శివలీలతో కలిసి మంగళవారం ఉదయం పది గంటల ప్రాంతంలో హన్వాడలో కల్లు తాగింది. కూతురు శివలీలకు మతిస్థిమితం లేదు. కల్లు తాగిన భాగ్యలక్ష్మి తాగిన మైకంలో కూతురితో కలిసి చెరువు వద్దకు వెళ్లింది. ప్రమాదవశాత్తు భాగ్యలక్ష్మి జారి చెరువులో పడి మృతి చెందింది. అయితే చెరువులో పడిన తల్లిని చూసిన మతిస్థిమితం లేని కూతురు ఏమీ అనలేక చెరువుకట్టపై ఉండిపోయింది. అటుగా వెళ్తున్న కొందరు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి బంధువులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మండలాధ్యక్షులపై అవిశ్వాసాలు పెట్టొచ్చు

- నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోలకు ఉంది
- హైకోర్టు స్పష్టీకరణ .. పలువురి దావాల కొట్టివేత

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు వ్యతిరేకంగా వచ్చిన అవిశ్వాస తీర్మానాలపై సమావేశాలు నిర్వహించే అధికారం ఆర్డీవోలకు ఉందని హైకోర్టు తేల్చిచెప్పింది. పలు మండలాల అధ్యక్షులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. తమకు వ్యతిరేకంగా అవిశ్వాస సమావేశాలు నిర్వహించేలా ఆర్డీవోలు నోటీసులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ.. యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ ఎంపీపీ ఉమాదేవి, రామన్నపేట్ ఎంపీపీ జ్యోతి, మద్నూర్ ఎంపీపీ లక్ష్మీబాయి, రామారెడ్డి ఎంపీపీ దశరథ్‌రెడ్డి, వరంగల్ జిల్లా గీసుకొండ ఎంపీపీ సౌజన్య, రంగారెడ్డి జిల్లా మర్రిగూడ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సరూర్‌నగర్ ఎంపీటీసీ ప్రతాప్‌రెడ్డి, నల్లగొండ జిల్లా చండూర్ ఎంపీపీ పల్లె కల్యాణి, కరీంనగర్ జిల్లా రామడుగు ఎంపీపీ కలగంటి కవిత, ఆదిలాబాద్ జిల్లా ఏలూరు సారంగాపూర్ మండల ఉపాధ్యక్షుడు, జనగాం జిల్లా మల్యాల ఎంపీపీ విమల, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ ఎంపీపీ సువర్ణ, డిచ్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్, నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలానికి చెందిన సుజాత, ప్రభాకర్ తదితరులు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ఆర్డీవోల నుంచి తమకు అవిశ్వాస నోటీసులు అందాయని, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 263 ప్రకారం ఆ నోటీసులు ఇచ్చే అధికారం ఆర్డీవోకు లేదని పేర్కొన్నారు. ఈ నోటీసులను కొట్టివేయాలని కోరారు. విచారణ చేపట్టిన జస్టిస్ కే శరత్ ధర్మాసనం నోటీసులు జారీ చేసే అధికారం ఆర్డీవోలకు ఉందని తెలిపింది. సాంకేతిక కారణాలు చూపించి అవిశ్వాసాన్ని తప్పించుకోలేరని పేర్కొంది.

గుదిబండగా కరెంటు ఒప్పందాలు

ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తును వాడకున్నా.. రూ.వందల కోట్లలో బిల్లుల బకాయిలు.. న్యాయ విచారణకు సర్కారు నిర్ణయం

- జస్టిస్ నర్సింహారెడ్డితో కమిషన్
- యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లపైనా విచారణ

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గుదిబండగా మారిన ఛత్తీస్‌గఢ్ కరెంటు ఒప్పందాల దుమ్మును దులపాలని రేవంత్‌రెడ్డి సర్కారు నిర్ణయించింది. ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటును కొనుగోలు చేయకున్నా.. ప్రస్తుతం ఒక్కయూనిట్ సరఫరా లేకున్నా.. వేల కోట్లలో బిల్లులు కట్టాల్సి రావడంపై న్యాయ విచారణకు ఆదేశించింది. ఇందుకోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డితో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అంతేకాదు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లపైనా ఈ కమిషన్ విచారణ జరుపుతుంది.



ఇదీ ఛత్తీస్‌గఢ్ కరెంటు కథ?

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక.. విద్యుత్తు అవసరాలను తీర్చాలనే ఉద్దేశంతో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం 2015 సెప్టెంబరు 22న ఛత్తీస్‌గఢ్‌లోని 1,000 మెగావాట్ల మార్వా ప్లాంట్ నుంచి 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందాలను కుదుర్చుకుంది. ఈ మేరకు పీపీఏ కింద తెలంగాణ డిస్కమ్‌లు, సీఎస్‌పీడీసీఎల్(ఛత్తీస్‌గఢ్) ఒప్పందాలపై సంతకాలు చేశాయి. అప్పట్లోనే విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ అభ్యంతరాలు వ్యక్తం చేసినా.. ప్రభుత్వం కౌంటర్ సమర్థనలను చేయిస్తూ.. ముందుకెళ్లింది. ఇక ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంటు సరఫరాకు వీలుగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్(పీజీసీఐఎల్)తోనూ ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ కరెంటును కొనుగోలు చేయకపోవడంతో.. పెనాల్టీ కింద రూ.300 కోట్లను పీజీసీఐఎల్‌కు చెల్లించాలని కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి(సీఈఆర్సీ) ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు.. బకాయిల పేరుతో మార్వా ప్లాంట్ నుంచి విద్యుత్తు సరఫరా జరగకున్నా.. పాయింట్ ఆఫ్ కనెక్షన్ చార్జీలు(పీవోసీ) రూపంలో ఏటా రూ.400 కోట్ల నుంచి రూ.450 కోట్లను చెల్లించాల్సి వస్తోంది. స్థిర చార్జీల భారం కూడా తెలంగాణ డిస్కమ్‌లను వీడడం లేదు. 2020-21లో రూ.828.13 కోట్లు, 2021-22లో రూ.394.98 కోట్ల మేర స్థిరచార్జీలను చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తం కాస్తా లేట్‌పేమెంట్‌తో కలుపుకొని రూ.3,576.89 కోట్లకు పెరిగినట్లు ఛత్తీస్‌గఢ్ చెబుతుండగా.. అది కేవలం రూ.2,100 కోట్లేనని తెలంగాణ డిస్కమ్‌లు వాదిస్తున్నాయి. కరెంటు బిల్లుల బకాయిలున్నాయంటూ రెండేళ్ల క్రితమే ఛత్తీస్‌గఢ్ కరెంటు సరఫరా నిలిచిపోయింది. నిజానికి తెలంగాణ డిస్కమ్‌లు 2021-22లో 1,631 మిలియన్ యూనిట్లు(కేవలం 19%) కొనుగోలు చేశాయి. 2022-23 ద్వితీయార్థంలో 2,713 మిలియన్ యూనిట్ల(31%) విద్యుత్తును కొనాలని అంచనాలు వేసినా.. ఆ పరిస్థితి లేదని తేలిపోయింది. 2023-24లో 78% విద్యుత్తు కొంటామనే అంచనాలున్నాయి. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు బకాయిల పేరుతో ఆ మేరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేశాయి. రెండేళ్లుగా కరెంటు సరఫరా లేకున్నా.. 12 ఏళ్ల పాటు విద్యుత్తు కొనుగోలు ఒప్పందం బూచీగా ఇప్పుడు తెలంగాణ డిస్కమ్‌లపై భారం పడే ప్రమాదం ఉంది. ఒప్పందంలో ఇంకా ఆరేళ్లు మిగిలే ఉన్నాయి. పీపీఏ ఒప్పందం ప్రకారం విద్యుత్తును కొనకుంటే.. ఛత్తీస్‌గఢ్ డిస్కమ్‌లు ఆ కరెంటును ఓపెన్‌యాక్సెస్‌లో విక్రయించుకోవచ్చు. ఒకవేళ తెలంగాణ ఒప్పందం కంటే.. ఓపెన్‌యాక్సెస్ విక్రయం తక్కువ ధరలో ఉంటే.. ఆ భర్తీని తెలంగాణ డిస్కమ్‌లు భరించాల్సి ఉంటుంది. ఇప్పుడు ఈ బకాయిలన్నీ తెలంగాణ డిస్కమ్‌ల పాలిట గుదిబండగా మారాయి. దీనిపై తెలంగాణ డిస్కమ్‌లు 2018లో విద్యుత్తు అప్పిలేట్ ట్రైబ్యునల్(అప్టెల్)ను ఆశ్రయించినా.. ఆ కేసు తేలే దాకా ఇబ్బందులు తప్పేలా లేవు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఈ తొందరపాటు ఒప్పందాలపై ఇప్పుడు రేవంత్ సర్కారు విచారణ జరిపించనుంది. మరోవైపు.. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లను వినియోగించుకోవాలా? వదిలేయాలా? అంటూ ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. భద్రాద్రిలో ఒక్కో ప్లాంట్ 270 మెగావాట్ల సామర్థ్యంతో.. మొత్తం నాలుగు ప్లాంట్లు 1,080 మెగావాట్లను ఉత్పత్తి చేస్తాయి. ఈ ప్లాంట్‌పై అప్పట్లోనే తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ అందుబాటులో ఉన్నా.. సబ్-క్రిటికల్ టెక్నాలజీతో ప్లాంట్ కట్టడంపై నిపుణులు విమర్శలు చేశారు. 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో యాదాద్రి ప్లాంట్ ఇంకా నిర్మాణంలోనే ఉంది. ఇక్కడ కూడా భూసేకరణ, టౌన్‌షిప్‌ల నిర్మాణం, సబ్-కాంట్రాక్టుల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ అంశాలపైనా జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ విచారణ జరపనుంది.

ఫలించిన 15 ఏళ్ల నిరీక్షణ

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల డీఎస్సీ 2008 అభ్యర్థుల హర్షం
- కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరిగిందని ఆనందం

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2008లో అర్హత పొంది, నియామకాలు పొందని అభ్యర్థులకు కనీస వేతనాల పద్ధతిలో ఉద్యోగాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తాము 15 ఏళ్లుగా పడుతున్న కష్టాల నుంచి ప్రభుత్వ ప్రకటనతో ఉపశమనం కలిగిందన్నారు. మంగళవారం సచివాలయంలోని మీడియా పాయింట్ వద్ద అభ్యర్థులు, అసోసియేషన్ ప్రతినిధులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... దశాబ్దంనర కాలంగా ఎదురుచూపులు నేడు ఫలించాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో తమకు న్యాయం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి, తమకు కాంట్రాక్ట్ పద్ధతిలో అయినా ఉద్యోగాలు ఇచ్చేందుకు ముందుకొచ్చినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తమకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంతో పాటు ఇతర అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. త్వరగా విధివిధానాలు ప్రకటించాలని వారు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 'డీఎస్సీ 2008 అసోసియేషన్' అధ్యక్షుడు ఉమామహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మాకు ఉద్యోగాలు ఇవ్వండి

- డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ టీచర్ల మొర
- వేర్వేరు సమస్యలపై 'ప్రజావాణి'కి 1470 అర్జీలు

సికింద్రాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తమకు తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలంటూ డీఎస్సీ 1998లో అర్హత సాధించిన ఉపాధ్యాయులు ప్రభుత్వానికి మొర పెట్టుకున్నారు. 1998 డీఎస్సీలో నియామక ప్రక్రియ లోపభూయిష్టంగా జరిగిందని, ఎన్నికలు రావడంతో 1999లో డీఎస్సీ ప్యానల్‌ను రద్దు చేశారన్నారు. దాంతో డీఎస్సీ-98లో క్వాలిఫై అయిన అభ్యర్థులు ఉద్యోగావకాశాలు కోల్పోయారని తెలిపారు. ఈ మేరకు ప్రజాభవన్‌కు తరలివచ్చిన పలువురు అభ్యర్థులు ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్నారు. ఇదే కాదు.. రేషన్ కార్డులు, పెన్షన్లు, ధరణి సమస్యలు, ఉద్యోగాలు, వైద్యంతోపాటు వేర్వేరు సమస్యలపై ప్రజావాణికి మంగళవారం 1,470 అర్జీలు వచ్చాయి. ఇందులో రెవెన్యూ పరమైన సమస్యలు 327, ఇంటి కోసం 251, పంచాయతీరాజ్ విభాగానికి 200, మైనార్టీ వెల్ఫేర్ సంబంధించి 145అర్జీలు ఉన్నాయి. ఆయా దరఖాస్తులను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జీ.చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య, ఇతర అధికారులు ప్రజలను స్వీకరించారు. సంబంధిత విభాగాల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, పుట్టుకతో అంగవైకల్యంతో బాధపడుతున్న తనకు పెన్షన్ మంజూరు చేయాలని నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన దండు గౌతమ్ (13) దరఖాస్తు చేసుకున్నాడు. ఆరో తరగతి విద్యార్థి అయిన గౌతమ్ లేచి నిలబడాలన్నా, కూర్చోవాలన్నా ఇతరులపై ఆధారపడే స్థితిలో ఉన్నాడు. అలాగే, రైలు ప్రమాదంలో తగిలినగాయాల వల్ల తన కాలు, చెయ్యి పని చెయ్యడం లేదని, ఆర్థిక సమస్యల్లో ఉన్న కుటుంబాన్ని పోషించుకునేందుకు తనకు ఉద్యోగం ఇప్పించాలని నాంపల్లి నేతాజీనగర్‌కు చెందిన జి.శశికాంత్ దరఖాస్తు చేసుకున్నారు. ఉప్పల్‌కు చెందిన పలువురు వృద్ధ మహిళలు తమకు పెన్షన్ మంజూరు చేయాలని, అంబర్‌పేటకు చెందిన పలువురు మహిళలు రేషన్ కార్డు కోరుతూ అర్జీలు పెట్టారు. కాగా, తమ ఉద్యోగాన్ని క్రమబద్ధీకరించాలని, వేతనాన్ని రూ.19,500కు పెంచాలని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్‌టైమ్ స్వీపర్లు అర్జీ చేసుకున్నారు. గత ప్రభుత్వం తీరు వల్ల 1500 మంది అభ్యర్థులు ఉద్యోగాలు లేక అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన జూనియర్ లైన్‌మెన్లు అభ్యర్థించారు. బేగంపేట్‌లోని ఈశ్వరీయ విశ్వ విద్యాలయ కేంద్రంలో నిర్వహించే ఆధ్యాత్మిక తరగతులకు తమను రానివ్వడం లేదంటూ పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు.



పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న బాలుడు గౌతమ్



అంటువ్యాధుల నివారణ కోసం నిర్మించబోయే ప్రయోగశాల భూమిపూజలో పాల్గొన్న వివిధ రంగాల ప్రముఖులు

అంటువ్యాధుల నివారణకు ప్రయోగశాల

- 25 కోట్లతో ఐఐపీహెచ్ ఆవరణలో ఏర్పాటు
- హిమాయత్‌సాగర్‌లో భూమిపూజ
- భవిష్యత్‌లో పలు పరిశోధనలు

రాజేంద్రనగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే అంటువ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకు హిమాయత్‌సాగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఐఐపీహెచ్) ఆవరణలో రూ.25 కోట్లతో ప్రయోగశాల(సైరస్ పూనావాలా సెంటర్ ఫర్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ అండ్ పాండమిక్ ప్రిపేర్డ్‌నెస్) నిర్మించనున్నట్లు ఐఐపీహెచ్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ మధుబాల రెంటల తెలిపారు. ఈ సెంటర్‌కు భూమిపూజను విల్లో పూనావాలా ఫౌండేషన్ సీఈవో జస్వీందర్ నారంగ్, ఇంటర్నేషనల్ పబ్లిక్ హెల్త్ సొసైటీ ఛైర్మన్ సి. శ్రీనివాస రాజు, ఐఐపీహెచ్ చీఫ్ మెంటార్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సంజయ్ జొడెపె, యూఎస్ఏకు చెందిన డాక్టర్ అనిల్ కౌల్‌తో కలిసి మంగళవారం నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ సెంటర్ అంటువ్యాధులను ఎదుర్కోవడానికి అంకితమైన మార్గదర్శక కేంద్రంగా పనిచేస్తుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలను సూచించడంలో ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ వారు క్యాన్సర్ స్క్రీనింగ్ ఎక్స్‌ప్రెస్ పేరుతో సుమారు రూ.10 కోట్ల విలువ చేసే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే బస్సును ఐఐపీహెచ్‌కు బహూకరించారు. ఈ బస్సులో ఇక మీదట గ్రామాల్లో తిరుగుతూ మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

మూడు బోర్లు వేసి అప్పుల పాలై రైతు ఆత్మహత్య

- మెదక్ జిల్లాలో కిష్టాపూర్‌లో ఘటన
- విద్యుదాఘాతంతో మహిళా రైతు, ఎలక్ట్రీషియన్ మృతి

చేగుంట, అడ్డగూడూరు, కోదాడ రూరల్, మార్చి 12: చేతికొచ్చే సమయంలో పంట ఎండిపోకూడదని మూడు బోర్లు వేయించినా చుక్క నీరు రాకపోగా.. అప్పుల పాలవ్వడంతో కలత చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మెదక్ జిల్లా చేగుంట మండల పరిధి కిష్టాపూర్‌కు చెందిన కుర్మ స్వామి(30) అనే రైతు తన పొలంలోని చెట్టుకు మంగళవారం ఉరి వేసుకుని మరణించాడు. కుర్మ స్వామి తనకున్న నాలుగు ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. పంటను కాపాడుకునేందుకు మూడు బోర్లు వేశారు. బోర్లు వేసేందుకు, పంట సాగుకు సుమారు నాలుగు లక్షల అప్పు చేశారు. నీళ్లు రాక పొలం ఎండిపోగా, అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుర్మ స్వామికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, పొలంలో కింద పడి ఉన్న 11కేవీ త్రీఫేజ్ మెయిన్ వైరును తొక్కి విద్యుదాఘాతానికి గురై యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం జానకీపురం గ్రామానికి చెందిన బోనాల లక్ష్మి(40) అనే మహిళా రైతు ప్రాణాలు కోల్పోయారు. లక్ష్మి రోజు మాదిరిగా మంగళవారం సాయంత్రం పొలంకు వెళ్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. ఇక, సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన షేక్ జానీమియా(35) అనే ఎలక్ట్రీషియన్ తన ఇంట్లో తెగిన విద్యుత్ తీగకు మర్మమతుల చేస్తూ విద్యుదాఘాతానికి గురై మరణించాడు.

రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో 4,356 అధ్యాపక పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకం
- నోటిఫికేషన్ జారీ.. 16న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు
- నాణ్యమైన విద్యే లక్ష్యం: మంత్రి దామోదర

పోస్టులు	ఖాళీల సంఖ్య	వేతనం (రూ.లలో)
ప్రొఫెసర్	498	1,90,000
అసోసియేట్ ప్రొఫెసర్	786	1,50,000
అసిస్టెంట్ ప్రొఫెసర్	1459	1,25,000
సీనియర్ రెసిడెంట్స్	1201	92,575
ట్యూటర్స్	412	55,000

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 26 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత తీర్చేందుకు రేవంత్ రెడ్డి సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. 2021 అక్టోబరు నుంచి ఖాళీగా ఉన్న 4,356 టీచింగ్ పోస్టులను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేయాలన్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నం.98 విడుదల చేసింది. ఇందులో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్, సీనియర్ రెసిడెంట్ పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీతో ఏటా సర్కారుపై అదనంగా రూ.634 కోట్ల భారం పడుతుందని మంత్రి తెలిపారు. మెడికల్ కాలేజీల్లోని అధ్యాపకుల నియామకాలన్నీ జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోని డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీల ద్వారా సత్వరమే చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల బలోపేతం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. జాతీయ వైద్య కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన విద్య అందించడానికి పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. కాగా, కాలేజీల వారీగా పోస్టుల వివరాలను ఆయా కాలేజీల వెబ్‌సైట్లలో పొందుపర్చారు. కాలేజీల వెబ్‌సైట్ల వివరాలు డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో (htpps://dme.telangana.gov.in) ఉన్నాయి. అన్ని కాలేజీల్లో ఈ నెల 16న వాక్-ఇన్-ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అర్హతలున్న అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పేర్కొన్న సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

లోక్‌సభ ఎన్నికలకు ఖర్గే దూరం!

- ఒక నియోజకవర్గానికే పరిమితం కాదలుచుకోలేదు: ఏఐసీసీ చీఫ్
- దేశవ్యాప్తంగా దృష్టి పెడతానని వెల్లడి
- గుల్బర్గా నుంచి అల్లుడిని దింపే చాన్స్

న్యూఢిల్లీ, మార్చి 12: ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మల్లికార్జున ఖర్గే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండే అవకాశం కనిపిస్తోంది. ఈ ఎన్నికలు అత్యంత కీలకమని, పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. తాను కూడా పోటీ చేస్తే ఒక నియోజకవర్గంపైనే దృష్టి పెట్టి, అక్కడే పరిమితం కావాల్సి ఉంటుందని ఖర్గే అభిప్రాయపడ్డారు. అయితే, పార్టీ వర్గాలు మాత్రం ఆయన పోటీ చేయాలని కోరుకుంటున్నాయి. ఈ ఎన్నికలను వదులుకోకూడదని, పోటీలో ఉండే పార్టీని ముందుండి నడిపించాలని వారు చెబుతున్నారు. కానీ, వీరి వాదనను ఖర్గే తోసిపుచ్చుతున్నారు. "రానున్న ఎన్నికలు అత్యంత కీలకం. పార్టీ చీఫ్‌గా ఒకే నియోజకవర్గానికి పరిమితం కాలేను. దేశవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలపైనా దృష్టిపెట్టాల్సి ఉంది" అని ఖర్గే తెలిపారు. కర్ణాటకలోని గుల్బర్గా నియోజకవర్గం నుంచి ఖర్గేని రంగంలోకి దింపాలని గత వారం జరిగిన సమావేశంలో నేతలు ఏకగ్రీవంగా భావించారు. ఈ నేపథ్యంలో ఆయన పేరును జాబితాలోనూ చేర్చారు. అయితే, ఖర్గే పోటీకి దూరంగా ఉండి, ఈసారి తన అల్లుడు రాధాకృష్ణన్ దొడ్డమానిని బరిలో నిలపాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. గుల్బర్గా నియోజకవర్గం నుంచి వరుసగా రెండుసార్లు విజయం సాధించిన ఖర్గే 2019 ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. అప్పటి నుంచి ఆయన రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పెద్దల సభలో విపక్ష నాయకుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. మరో నాలుగేళ్ల ఆయన పదవీ కాలం ఉంది. ప్రస్తుతం ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే సిద్దరామయ్య మంత్రి వర్గంలో కేబినెట్ మంత్రిగా ఉన్నారు. తొలుత ప్రియాంక్‌ను పార్లమెంటు బరిలో నిలపాలని అనుకున్నా.. తర్వాత ఈ నిర్ణయాన్ని పార్టీ వెనక్కి తీసుకుంది. ఇదిలా వుంటే, ఖర్గే కనుక పోటీ చేయకపోతే, ఏఐసీసీ అధ్యక్షులుగా ఉండి ఎన్నికలకు దూరంగా ఉన్న వారిలో ఈయనే తొలి నాయకుడు అవుతారు.

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలి

- వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి. రవినాయక్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), మార్చి 12 : రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి అన్ని జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ విషయమై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు చేశారు. ఎలాంటి తప్పులు లేకుండా ఓటరు జాబితాను రూపొందించాలని, పోస్టల్ బ్యాలెట్ ముద్రణకు ప్రింటింగ్ ప్రెస్‌ను ముందే గుర్తిం చాలని, హోమ్ ఓటింగ్ ప్రక్రియ సక్రమ నిర్వహణకు సరైన ప్రణాళిక ముందు నుంచే సిద్ధం చేసుకోవాలని, ఎన్నికల నోటిఫి కేషన్ వెలువడినప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా అవసరమైన వీడియో సర్వేలెన్స్, వీడియో వీక్షణ తదితర పనుల కోసం అవసరమైన కెమెరాలను ముందే సిద్ధం చేసుకోవాలని, మంచి మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సమాచారాన్ని ఈనెల 13 లోగా పంపించాలని, తదితర సందర్భాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అంశాలపై వివరించారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రవినాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రసాద్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, డీఆర్వో కేవీవీ రవికుమార్ పాల్గొన్నారు.

మిగిలింది ఆమరణ దీక్షే

- కనీస పెన్షన్ పెంపునకు ఎన్నో ఆందోళనలు చేశాం
- ఆర్టీసీ, ఈపీఎస్ పెన్షనర్ల జాతీయ సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు



ధర్నా చేస్తున్న ప్రభుత్వరంగ సంస్థల ఈపీఎస్ పెన్షనర్లు

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 12 : ఆర్టీసీ, ప్రభుత్వ రంగసంస్థల ఈపీఎస్ పెన్షనర్ల కనీస పెన్షన్ పెంపునకు ఇక ఆమరణదీక్ష ఒక్కటే మిగిలిందని ఆర్టీసీ, ఈపీఎస్ పెన్షనర్ల జాతీయ సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రాజసింహుడు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం దగ్గర ఆర్టీసీ, ఈపీఎస్ పెన్షనర్లు నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పీఎఫ్‌పై వస్తున్న కనీస పెన్షన్ కరువు భత్యంతో రూ.7500కు పెంచాలని, పెన్షనర్ల భార్యాభర్తలకు ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలనే తదితర డిమాండ్ల సాధన కోసం అనేక సంవత్సరాలుగా తీవ్ర స్థాయిలో ఆందోళనలు నిర్వహించామని తెలిపారు. ఇక ఆమరణదీక్షతో ఆత్మత్యాగాలకు సిద్ధమయ్యామని ఆయన పేర్కొన్నారు. దేశంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం కేంద్ర ప్రభుత్వం తమ పీఎఫ్ డబ్బులను లక్షల కోట్ల రూపాయలు కేటాయించడం అన్యాయమని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తనా నియమావళికి ముందే కనీస పెన్షన్ పెంపుపై ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు జీబీ పాటిల్, ఉమేష్ కుమార్, ఆర్.నారాయణ, మనోహర్, నాగాంజనేయులు, జె.ఎస్.రెడ్డి, బస్వరాజ్, సుల్తాన్, డేవిడ్ పాల్గొన్నారు.

సీట్ల కేటాయింపులో సామాజిక న్యాయం ఏదీ ?

- బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ యాదవ్

జడ్చర్ల, మార్చి 12 : రాష్ట్రంలో పార్లమెంట్, స్థానిక సంస్థల శాసనమండలి ఉప ఎన్నికల్లో ప్రధానపార్టీలన్నీ సీట్ల కేటాయింపులో సామాజిక న్యాయం పాటించలేదని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ యాదవ్ అన్నారు. మంగళవారం బీసీ సేన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా పార్టీలు బీసీలను విస్మరించి ఒకే సామాజికవర్గానికి సీట్లు కేటాయించడం సామాజిక స్ఫూర్తికి తూట్లు పొడిచాయని దుయ్యబట్టారు. బీసీ నాయకులు తిరగబడే రోజు దగ్గర్లోనే ఉందని స్పష్టం చేశారు. అధికార, విపక్ష పార్టీలన్నీ సామాజిక న్యాయస్ఫూర్తిని పాతరేస్తున్నాయని దుయ్యబట్టారు. కార్యక్రమంలో జి.నర్సింములు, కే.గోపాల్, మురళీ, సురభి రఘు, వెంకటేష్, జగదీశ్వర చారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు ఘన సన్మానం



మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో, అధికారులు

హన్వాడ, మార్చి 12 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పెద్దదర్పల్లి గురుకుల పాఠశాలలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. మొదట ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిటైర్డ్ డీఈవో విజయకుమార్, తహసీల్దార్ కిష్యానాయక్, ఎంపీడీవో యశోదమ్మ, ఎంఈవో రాజునాయక్ పాల్గొని మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఇంకా ఉన్నత పదవుల్లో కొనసాగేందుకు ముందుకు రావాలని కోరారు. మాతృమూర్తులుగా, మార్గదర్శులుగా మారి విద్యార్థులను ఉన్నతంగా ఎదిగేందుకు పాటుపడాలని కోరారు. వివిధ సంఘాల నాయకులు కిష్యా నాయక్, వెంకటరాయుడు, శైలజ, మధుశాలిని, మల్లేష్, రాఘవేందర్, సయ్యద్ పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా బోయ శ్రీనివాసులు

మహబూబ్‌నగర్ రూరల్, మార్చి 12 : బహుజన సమాజ్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా బోయ శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం మాచన్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు విద్యార్థి దశ నుంచి ప్రగతిశీల రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ఆయన తండ్రి బోయ వెంకటయ్య మహబుబ్ నగర్ మండల తొలి మండల పరిషత్ అధ్యక్షుడిగా కొనసాగారు. శ్రీనివాసులు సతీమణి స్వప్న ప్రస్తుతం ఎంపీటీసీ సభ్యురాలిగా కొనసాగుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బహుజన వాదంతో శ్రీనివాసులు బీఎస్పీలో చేరగా ఆ ఎన్నికల్లో స్వప్న మహబూబ్‌నగర్ అసెంబ్లీ స్థానం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేశారు. తాజాగా శ్రీనివాస్‌కు జిల్లా అధ్యక్ష పదవి వరించింది. పార్టీ జిల్లా అధ్యక్షునిగా అవకాశం కల్పించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో బహుజన వాదాన్ని విస్తరించడంతో పాటు ప్రజా సమస్యలపై పోరాడుతామని తెలిపారు.



ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న శ్రీనివాసులు

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణే ధ్యేయం

- పోలీసుల ఫ్లాగ్‌మార్చ్‌లో ఏఆర్ ఏఎస్పీ సురేష్‌కుమార్

మహబూబ్‌నగర్, మార్చి 12 : జిల్లాలో రాబోయే పార్ల మెంట్ ఎన్నికలో ప్రజలు ప్రశాంతంగా ఓటు వేసే వాతావ రణం కల్పించడం, పోలీసులు ఉన్నారనే భరోసా ఇవ్వడం కోసమే కేంద్ర బలగాలచే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్ తెలి పారు. మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు వీధుల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం కల్పించడం పోలీసుల కర్తవ్యమని, సంఘ వ్యతిరేక శక్తుల చర్యలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని హెచ్చరించారు. అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద పటిష్ఠ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరు పాల్పడినా పోలీసులకు సమా చారం అందించాలని కోరారు. ప్రజలు పోలీసులకు సహక రించాలని కోరారు. సమస్యాత్మక ప్రాంతాలపై మరింత నిఘా ఉంటుందని, గతంలో జరిగిన అల్లర్లు, గొడవలను దృష్టిలో ఉంచుకొని అలాంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ స్వామి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగులపై చిన్నచూపు తగదు

- కలెక్టరేట్ ముందు ఆందోళనలో సంఘం నాయకులు

పాలమూరు, మార్చి 12 : అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరిస్తూ సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పెట్టడం సరికాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పెట్టాలనే విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ఒకపూట బడితోపాటు మే నెల పూర్తిగా టీచర్స్, హెల్పర్స్‌కు సెలవులు ఇవ్వాలని కోరారు. పనిచేయని సెల్‌ఫోన్లు తక్షణమే తీసుకుని వాటిస్థానంలో కొత్త 5జీ ట్యాబులు ఇవ్వాలన్నారు. జీవో నెంబర్ 14, 19, 8లను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు సరోజ, ప్రభావతి, రాజ్యలక్ష్మి, గౌసియాబేగం, పద్మ, కవిత, కమల ప్రసంగించారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్, డీడబ్ల్యూవోతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని ఏఓ హామీ ఇచ్చారని తెలిపారు.



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు, నాయకులు

తెలంగాణలో కాంగ్రెస్‌కే భవిష్యత్తు

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- పార్టీలో చేరిన హన్వాడ లేబర్ సంఘం నాయకులు

మహబూబ్‌నగర్, మార్చి 12 : తెలంగాణలో బీఆర్ఎస్‌ది గత చరిత్రేనని, ఇక భవిష్యత్ అంతా కాంగ్రెస్‌దేనని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలు, ప్రజాపాలనకు ఆకర్శితులై బీఆర్ఎస్‌లో పని చేసిన వారంతా కాంగ్రెస్‌వైపు వస్తున్నారన్నారు. మంగళవారం డీసీసీ కార్యదర్శి కృష్ణయ్య ఆధ్వర్యంలో హన్వాడకు చెందిన లేబర్ సంఘం నాయకులు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరగా ఆయన కండువాలతో స్వాగతించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ను నమ్మి వచ్చిన వారందరినీ కడుపులో పెట్టుకుని చూసుకుంటామని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో దౌర్జన్యాలు, భూకబ్జాలు, దోపిడీలు చేసేవాళ్లని, ఇప్పుడు అవన్నీ బంద్ అయ్యాయని, కాంగ్రెస్ అంటేనే ప్రజల పక్షాన నిలబడి వారి సంక్షేమం కోసం పనిచేసే పార్టీ అని చెప్పారు. బీఆర్ఎస్‌ను వీడి రానున్న రోజుల్లో ఎంతోమంది కాంగ్రెస్ శిబిరానికి రాబోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో లేబర్ సంఘం టంకర గ్రామ అధ్యక్షుడు బుడ్డన్న, మల్లేష్, జమిస్తాపూర్ వెంకటయ్య, కాటారం రామచంద్రయ్య, అంజనేయులు, పెద్దదర్పల్లి మల్లేష్, నీలేష్ పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

ఆలయ ప్రారంభానికి ఆహ్వానం

- ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన జంగమయ్యపల్లి గ్రామస్థులు

నవాబ్‌పేట, మార్చి 12 : మండలంలోని జంగమయ్యపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయం ప్రారంభంతోపాటు, బొడ్రాయి, ధ్వజస్తంభం, నవగ్రహాలు తదితర దేవతా విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాలకు రావాలంటూ జంగమయ్యపల్లి గ్రామస్థులు ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు మాజీ సర్పంచ్ వెంకటేష్, మంచాల గోపాల్ ఆధ్వర్యంలో మంగళవారం మహబూబ్‌నగర్ ఎంపీని, స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీ. లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డిలను కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 14, 15, 16 మూడు రోజుల పాటు విగ్రహావిష్కరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జంగం రాజు, మునగపాటి రమేష్, గోపాల్, వెంకట్రాజు, ముష్టి గోపాల్, వీరేష్, చెన్నయ్య, నర్సింహ, కృష్ణయ్య, ఎం చెన్నయ్య పాల్గొన్నారు.



ఎంపీ మన్నెకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న జంగమయ్యపల్లి గ్రామస్థులు

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- సామాజిక తనిఖీలో డీఆర్డీఏ పీడీ నర్సింహులు

దేవరకద్ర, మార్చి 12 : ఉపాధిహామీ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్డీఏ పీడీ నర్సింహులు, అడిషనల్ డీఆర్డీవో ముసాహిద్‌బేగం ఉపాధి సిబ్బందికి సూచించారు. మంగళరం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామీణ ఉపాధి సామాజిక తనిఖీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండలంలోని అన్నిగ్రామాల్లో రెండు ఏళ్లగా జరిగిన ఉపాధి హామీ పనుల వివరాలను సభలో చదివి వినిపించారు. మండలంలోని రూ.3 కోట్ల 48 లక్షల విలువ గల పనులు జరగగా అధికారులు మాట్లాడుతూ మండలంలోని కొన్ని గ్రామాల్లో మొక్కల పెంపకం నిర్వహణ లోపం ఉందని, ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని, కూలీల సంఖ్య పెంచి ఉపాధి పొందేలా చూడాలన్నారు. గతంతో పోలిస్తే ఆడిట్ ఈసారి బాగానే ఉందన్నారు. కూలీల పని దినాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. వారికి కావాల్సిన అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబుడ్స్ పర్సన్ సతీష్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాసరావు, శ్రీనివాసులు, ఏపీవో సంజీవ, ఉపాది సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పత్రాలను పరిశీలిస్తున్న డీఆర్డీవో

హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

హన్వాడ, మార్చి 12 : హన్వాడలో ఉన్న ఎస్‌సీ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హన్వాడ తహసీల్దార్ కార్యాలయం ముందు ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్ సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేశారు. సరైన సదుపాయలు లేక విద్యార్థులు సతమతమవుతున్నారని, ప్రభుత్వం, అధికారులు స్పందించి పరిష్కరించాలని కోరారు. నిధులున్నా అధికారులు నిర్లక్ష్యంతో పనులు చేయడంలేదని నాయకులు ఆరోపించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు భరత్, శ్రీనాథ్, కేవీపీఎస్ రాష్ట్ర సభ్యుడు మాణిక్యంరాజు, సంఘాల నాయకులు బాలకృష్ణ, కళ్యాణ్, శ్రీనివాస్ వెంకటేష్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న విద్యార్థులు

ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు చేపట్టాలి

- తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 12 : పదోన్నతులకు సంబంధించి కోర్టు నుంచి సానుకూలమైన నిర్ణయం వచ్చిందని వెంటనే మల్టీజోన్-2లో వెంటనే ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు చేపట్టాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదోన్నతులకు సంబంధించి కోర్టు తీర్పునకు అనుగుణంగా వెంటనే గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు చేపట్టాలని, అన్ని ఉపాధ్యాయ కేడర్ల పోస్టులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ సిబ్బందిని మినిమం టైంస్కేల్ ఇవ్వాలని అలాగే మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నారు. టీచర్లకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న విధంగా మహిళా టీచర్లకు రెండు సంత్సరాలు చైల్డ్ కేర్ లీవ్ ఇవ్వాలని, అది కూడా వారి సర్వీస్ మొత్తంలో ఎప్పుడైనా వినియోగించుకునే విధంగా అవకాశం ఇవ్వాలని కోరారు. పీఆర్సీ కమిటీ గతంలో మాదిరిగా కాకుండా సాధ్యమైనంత త్వరగా పీఆర్సీ అమలు అయ్యే విధంగా చూడాలన్నారు. 317 జీవో బాధితులకు సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లం సునీల్ కుమార్, ప్రధాన కార్యదర్శి గడ్డం బాబునాయుడు, రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్‌గౌడ్, కరుణాకర్‌గౌడ్, జిల్లా కోశాధికారి రాజమోహన్‌రెడ్డి, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు

చట్టాలపై అవగాహన ఉండాలి : ఎస్ఐ

దేవరకద్ర, మార్చి 12 : సమాజంలో ప్రతీ విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ నాగన్న విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలిక పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపరాదని సూచించారు. ఒకవేళ సమస్యలు ఎదురైతే 1930 నంబరుకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలన్నారు. క్రిమినల్ చట్టం, రోడ్డు ప్రమాదాలు, సైబర్ క్రైంవంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

'కేసులు ఎత్తివేయాలి'

పాలమూరు, మార్చి 12 : దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమకారులపై, రైతులపై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.వెంకటయ్య, జి.గోపాల్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సాగు భూమి సమస్యలను పరిష్కరించాలని, పట్టాలు ఇవ్వాలని మార్చి 23వ తేదీన హైదరాబాద్‌లో చేపట్టిన సదస్సును జయప్రదం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా ప్రొ.హరగోపాల్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, కన్నెగంటి రవి ప్రముఖులు హాజరవుతారని వివరించారు. అనంతరం కరపత్రం విడుదల చేశారు. సమావేశంలో టీపీఎఫ్ నాయకులు బుచ్చారెడ్డి, జమ్ముల బాల్‌రెడ్డి, సి.షైపాల్, రాజు పాల్గొన్నారు.

మామిడి పంటల సస్యరక్షణకు చర్యలు

హన్వాడ, మార్చి 12 : అధిక ఉష్ణోగ్రలతో మామిడి పంటలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై మంగళవారం హైదరాబాద్ నుంచి ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. టంకర రైతు వేదికలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్, ఉద్యానశాఖ అధికారి సాయిబాబా, హన్వాడ, గండీడ్, మహ్మదాబాద్, మహబూబ్ నగర్ మండలాల వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు, రైతులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వరి, మామిడి పంటలు అధిక ఉష్ణోగ్రతను తట్టుకోలేక ఎండిపోతున్న పంటను కాపాడుకునే విధంగా చేపట్టే చర్యలను శాస్త్రవేత్తలు వివరించారు. రైతులతో మాట్లాడారు.

ఆలస్యంగా వచ్చిన టీచర్లకు మెమో జారీ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 12 : పాఠశాలకు ప్రార్థన సమయానికి హాజరుకాని ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేసినట్లు డీఈవో రవీందర్ తెలిపారు. మంగళవారం మహబూబ్‌నగర్ మండల పరిధిలోని వెంకటాపూర్ ప్రాథమిక పాఠశాలను ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య తనిఖీ చేశారని తెలిపారు. ఆ సమయంలో పాఠశాలకు ప్రార్థన సమయానికి ప్రధానోపాధ్యాయులు ఒక్కరే హాజరయ్యాయరని, మిగతా ఉపాధ్యాయులు హాజరు కాకపోవడంపై సదరు అధికారులు డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. వారి వివరాల మేరకు సదరు ఉపాధ్యాయులకు మెమో జారీచేసినట్లు డీఈవో తెలిపారు.

వేతనాలు చెల్లించాలి

చిన్నచింతకుంట, మార్చి 12 : గ్రామ పంచాయతీ సిబ్బందికి సంబంధించిన వేతనాల జాప్యంపై మంగళవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దేవదానం మాట్లాడుతూ దాదాపు మూడు నెలలుగా వేతనాలే లేక సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సబ్బులు, నూనెలు, శానిటైజర్లు వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో అనిల్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటన్న, కొండన్న, చంద్రన్న, తెలంగాణ గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి సాంబశివుడు, గోపాల్, శ్రీను, కురుమన్న పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు సన్మానం

రాజాపూర్, మార్చి 12 : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలకు చెందిన 26 మంది విద్యార్థులు వనపర్తి జిల్లా పెబ్బేర్‌లో ఆదివారం నిర్వహించిన 1వ నేషనల్ కరాటే చాంపియన్ షిప్-2024లో పాల్గొన్నారు. ఆరు గోల్డ్ మెడల్స్, 10 సిల్వర్ మెడల్స్, 10 ఇతర మెడల్స్ సాధించడంతో మంగళవారం ఆ విద్యార్థులను, కరాటే మాస్టర్ కృష్ణయ్యను పాఠశాల ప్రిన్సిపాల్ పావని, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి, అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణలో కేంద్రం నిర్లక్ష్యం

- టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య

హన్వాడ, మార్చి 12 : ఎస్సీ వర్గకరణ చేయడంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈ నెల 22న నిర్వహించే జిల్లా సదస్సులో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య కోరారు. మంగళవారం హన్వాడలో జిల్లా సదస్సు పోస్టర్‌ను ఎం పీపీ బాలరాజు, టీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య, రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్, జిల్లా నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగ, మాదిగ ఉప కులాల రిజర్వేషన్ వర్గీకరణ చేయకుండా ప్రభుత్వాలు అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. విద్య, ఉద్యోగ, రాజకీయ అభివృద్ధి కోసం నిర్వహించే సదస్సుకు అందరు కలిసి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యమంలో సంఘం నాయకులు కాలే యాదయ్య, కృష్ణయ్య, రాజు, వీరేష్, ఆంజనేయులు, కేశవులు, బాలకిష్టయ్య పాల్గొన్నారు.

బాలుడిపై వీధికుక్కల దాడి

జడ్చర్ల, మార్చి 12 : జడ్చర్ల పట్టణంలోని విజయనగర్ కాలనీలో ఓ బాలుడిపై వీధి కుక్కలు దాడి చేశాయి. కాలనీలోని స్నేహ చికెన్ ఫామ్స్ వద్ద నివాసముంటున్న ఓ దంపతులకు చెందిన ఐదేళ్ల బాలుడు సోమవారం రాత్రి ఆరుబయట ఉండగా వీధికుక్కలు దాడి చేశాయి. దాడిలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. కాలనీలో చికెన్ ఫామ్స్ ఉన్నందున వీధి కుక్కల బెడద ఎక్కువైందని కాలనీవాసులు పేర్కొన్నారు.

పాలమూరులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

- ఉమ్మడి జిల్లాలోని యువతకు సువర్ణ అవకాశం : ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్, మార్చి 12 : పాలమూరు సిగలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ చేరింది. పట్టణంలోనే టాస్క్ సంస్థ ఆధ్వర్యంలో రూ.20 కోట్లతో భవన నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్ దగ్గర గల టాస్క్ కార్యాలయంలో సీఈవో శ్రీకాంత్‌తో ఎమ్మెల్యే యెన్నం ఒప్పందం చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఐటీఐ ఒకేషనల్ ఇంటర్, డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు, యువతకు ఉపయో గకరమన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సరైన కోర్సుల్లో నిరుద్యోగులకు స్కిల్ డెవలప్ మెంట్‌లో శిక్షణ ఇప్పించి వారిలో స్కిల్స్‌ను ప్రపంచానికి పరిచయం చేయాలనేదే లక్ష్యమ న్నారు. అందుకనే టాస్క్ సంస్థ ఆధ్వర్యంలో రాబోవు మూడు వారాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రారం భం చేయబోతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనతికాలంలోనే ఈ సెంటర్‌ను మహ బూబ్‌నగర్ పట్టణంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీగా రూపాంతరం చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.



టాస్క్ సీఈవోకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే యెన్నం

అదేవిధంగా, పట్టణంలో స్కిల్ డెవలప్‌మెంట్ భవన నిర్మాణానికి అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ద్వారా రూ.20కోట్లతో అర్ అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంజూరు చేసినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని యువతకు ఇది సువర్ణ అవకాశంగా పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌ను స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌గా మార్చేందుకు సహక రిస్తున్న ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి, సెంటర్ అనుమతిచ్చిన ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, టాస్క్ సీఈవో శ్రీకాంత్‌లకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వాలీబాల్ క్రీడాకారిణికి అభినందన

పాలమూరు యూనివర్సిటీ, మార్చి 12 : ఎంజీ యూనివర్సిటీ కొట్టాయం కేరళకు ప్రాతినిధ్యం వహించిన మక్తల్‌కు చెందిన ప్రముఖ వాలీబాల్ క్రీడాకారిణి అనన్యశ్రీ పాలమూరు యూనివర్సిటీకి వచ్చిన సందర్భంగా పీయూ వీసీ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్‌రాథోడ్ అభినం దించారు. అనన్యశ్రీ చైనాలోని చెంగ్డులో జరిగిన వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో, అస్సాం రాష్ట్రంలోని గుహతిలో జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో సిల్వర్ మెడల్ సాధించింది. అలాగే, కేఐఐటీ భువనేశ్వర్‌లో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ గేమ్స్‌లో గోల్డ్ మెడల్‌కు ప్రాతినిధ్యం వహించింది. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఆమె తల్లిదండ్రులు వరలక్ష్మి, ఆనంద్ పాల్గొన్నారు.

బ్యాంకింగ్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్(కలెక్టరేట్), మార్చి 12 : బీసీ స్టడీ సర్కిల్ మహబూబ్ నగర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇనిస్టి ట్యూట్‌లో చేరేందుకు గాను దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీసీ అభివృద్ధి జిల్లా అధికారి ఆర్.ఇందిర, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఏ.స్వప్న మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో రెండు నెలల పాటు నాన్ రెసిడెన్షియల్ పద్ధతిన సంబంధిత ఇనిస్టిట్యూట్‌లో ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాలకు చెందిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు. గ్రాడ్యు యేట్‌లో ఉత్తీర్ణత పొంది, 26 సంవత్సరాలలోపు ఉన్నవారు వెబ్‌సైట్‌లో ఈ నెల 15 నుంచి 25 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల ఎంపిక కోసం ఈనెల 31న ఆన్‌లైన్ స్క్రీన్ టెస్ట్ నిర్వహిస్తామని తెలిపారు.

రాష్ట్ర హ్యాండ్‌బాల్ మహిళా జట్టు సారథిగా రోజా

జడ్చర్ల, మార్చి 12 : మహారాష్ట్రలోని హవేలిలో ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న 52వ మహిళల జాతీయ హ్యాండ్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టుకు సారథిగా(కెప్టెన్) పాత్లావత్ రోజా ప్రాతినిధ్యం వహించనుందని తెలం గాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు బాలత్రిపుర సుందరి, కార్యదర్శి పి.శంకర్‌నాయక్ తెలిపారు. జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ సెకండీయర్ చదువుతున్న రోజా ఇటీవల కరీంనగర్ జిల్లాలో తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో జరిగిన సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి, ప్రతిభ కనబర్చినట్లు వారు పేర్కొన్నారు.